# పిరికివాడు

తన దేశంమీదకు పరదేశం దండెత్తి నెమ్మదిగా ఆక్రమింపు కుంటున్నదని వినగానే, పిరికివాడు రెండు రకాల జండాలు తయారుజేసు కొని కూచున్నాడు. ఒకటి స్వదేశం జండా, ఒకటి దండెత్తి వచ్చిన పరదేశం జండా.

"స్వదేశం గెలిస్తే ఈ జెండా, పరదేశం గెలిస్తే ఈ జెండా" అని మనస్సులో అనుకొని, గదిలో ఒకమూల పెట్టాడు. ఇక ఏ దేశం గెలిచినా తనకేమీ ఫరవా లేదనుకున్నాడు. "స్వదేశం గెలిస్తే స్వదేశం జెండా వుండనే వుంది. పరదేశం గెలిస్తే పరదేశం జెండ వుండనే వుంది. ఇక నాకేం?" అనుకున్నాడు. పరదేశ సైన్యాధ్యక్షుడిమీద, "నీకుదీర్ఘాయు రస్తు" అని కొన్ని సీసపద్యాలు రాసి తయారుగా వుంచుకొన్నాడు కూడాను.

అసలు పిరికివాడికి రెండు దేశాలు ఎందుకు యుద్ధంలోకి దిగాలో ఇంతమంది తమ ప్రాణాలను దేశంకోసం ఎందుకు అర్పించాలో అర్థ మయ్యేదికాదు. సంకుచితదృష్టి, మూర్ఖత్వం ఈ రెండే దీనికి కారణ మను కొనేవాడు. తాను యీ కక్షలకు అతీతుడననీ, తన హృదయం అతి విశాల మనీ అనుకునేవాడు. కనక మూర్ఖులు యుద్ధాలు చేసుకొని రక్తపాతం కలిగించుకునేటప్పుడు తనబోటి విశాలహృదయులు ఏం చెయ్యాలి? తమ సుఖంకోసం తాము పాటుపడాలి. ఆలోచించి పిరికివాడు ఈ నిర్ణయానికొచ్చి దానికోసం పాటుపట్టం మొదలు పెట్టాడు.

కాని యుద్ధం తీవ్రరూపం దాల్చిందగ్గరనుంచీ పిరికివాడు తను తల పెట్టిన కార్యం అనుకున్నత తేలిక కాదని గ్రహించాడు. ఏదేశం గెలు స్తుందో ముందే ఎలా తేల్చుకోవటం?

రాత్రంతా ఆలోచించి ఇక స్వదేశం గెలవదు గనుక పరదేశం జెండా పట్టుకొని బయల్దేరదామని నిశ్చయించుకొని తెల్లవారి లేచేటప్పటికి "స్వదేశం సేనలు కొన్ని కొన్ని రంగాల్లో గెలిచాయి" అని పెద్ద పెద్ద అక్షరాల్తో వార్తా పత్రికలు ప్రచురిస్తూ వుండేవి. స్వదేశజెండా పట్టుకుని బయల్దేరదామనుకున్నరోజు, విదేశసేనలు స్వదేశ సేనలను తరిమి వేశాయి" అని వార్తలు వస్తుండేవి!

పిరికివాడికి ఏమీ తోచక, ఏజెండా పట్టుకుని ఊరేగాలో తేముల్చు కోలేక హైరానపడిపోయాడు. రెండు జెండాలకూ ఎదురుగా ఎప్పుడూ ఆ గదిలోనే కూర్చునేవాడు. తాను రాసిన పద్యాలు మోకాలుమీద కూర్చుని రిహార్సులు వేసుకునేవాడు. వొక క్షణం విదేశం జెండా బుజం మీద పెట్టు కొని గదిలో ఇటూ అటూ షదారు జేసేవాడు — వొకక్షణం స్వదేశంజెండా పట్టుకొని గంతులు వేసేవాడు రెండూ మూలపెట్టి, ఎదురుగా నిలబడి, "స్వదేశం గెలిస్తే ఈ జెండా—విదేశం గెలిస్తే ఈ జెండా" అని వెర్రిగా అరిచేవాడు.

వొకరోజు శత్రువు ఆ ఊరి మీదకే వస్తున్నాడని, ఏభై మైళ్ళ దూరంలో వున్నాడని వదంతులు ప్రబలినై. సైన్యంలో జేరగా మిగిలిన ధైర్యవంతులు ఊరు ఖాళీచెయ్యటం మొదలుపెట్టారు. పిరికివాడికి ఆవేశం ఎక్కింది. ఇన్నాళ్ళనుంచీ తాను వేసుకున్నప్లాను, ఆచరణంలో పెట్టి దాని ఫలితాన్ని అనుభవించే గడియ దగ్గర కొచ్చిందనుకొన్నాడు. కదలకుండా మెదలకుండా తనగదిలోని జెండాలకు ఎదురుగా బాచీపెట్టు వేసుక్కూచుని "స్వదేశం గెలిస్తే ఈ జెండా" అనుకొని "ఈజెండే, ఈజెండే ఇదే జెండా" అనుకుంటూ వెర్రివాడిలా గదంతా చిందులు తొక్కాడు.

వొక స్నేహితుడు కావలసిన సామానంతా పీకకట్టుకొచ్చి "రావా?" అని అడిగాడు.

"నేనా? నేనెందుకు రావడం? నేనేం పిరికివాణ్ణా? పిరికివాళ్ళు పారి పొండి, నే రాను. ఈజెండా—ఈజెండా ఈజెండే" అన్నాడు పిరికివాడు.

బయట ఖాళీచేస్తున్న జనం కోలాహలం పిరికివాడి గదిలోక్కూడా వినిపిస్తూవుంది. రోడ్లమీద జనం అన్ని దిక్కులకూ తోకలు తెగిన నక్కల్లా పరుగెత్తుతూ వున్నారు. అంత జనంలోనూ బళ్ళూ కార్లూ కళ్ళు మూసుకొని తిరుగుతున్నై. మధ్య మధ్య మిలిటరీ కార్లుగంటల గణగణ మోగించుకుంటూ రంయిన వెళ్తున్నై, దూరాన్నుంచి బాంబులు పేలిన ధ్వనులు వినిపిస్తున్నై. జనానికి ఏం చెయ్యాలో తెలియక, ఎక్కడికి పారిపోవటానికీ తోచక రోడ్డుకి అడ్డంగా, బయల్దేరిన చోటునుంచి పరుగెత్తిన చోటుకీ, పరుగెత్తిన చోటునుంచి బయల్దేరిన చోటుకి పరిగెత్తుతూ కార్లంకిందా బళ్ళ కిందాపడి నలిగిపోతూవున్నారు. మనుష్యుల్లోని ఈ చలనమంతా శారీరకమే! బుర్రలు ఆట్టం ఎప్పుడో మానుకున్నై. యుద్ధంరోజుల్లో బళ్ళే మనుష్యులూ మనుష్యులే బళ్ళూ?

పిరికివాడు గదిలోనుంచి యిదంతా చూశాడు. పారిపోతున్న జనాన్ని చూచి తనలోతాను నవ్వుకొన్నాడు. "పిరికి వెధవలు" అనుకున్నాడు. హఠాత్తుగా పరదేశంజెండా పట్టుకొని "ఈ జెండా, ఈ జెండా ఇదే జెండా" అనుకుంటూ బజార్న పడ్డాడు.

జనం అతన్ని మిలిటరీ లారీని చూచినట్లు చూచి రెండు పాయలై దారిచ్చింది పిరికివాడు ఆ మధ్యనుంచి పరదేశం జెండా భుజానపెట్టుకొని "ఇదేజెండా, ఒకటే జెండా, ఒకటే జెండా, ఏకైక జెండా" అని కేకలు పెట్టుకుంటూ పరుగెత్తుతున్నాడు.

జనం విరగబడి తొక్కుకుంటూ వుందేగాని అతన్ని ఏమి అనలేదు. గుడ్లువప్పజెప్పి చూస్తూ వూరుకుంది. ఏ పని చేస్తున్న మనిషి పని ఆపేసి స్థాణువై నిలబడి చూస్తున్నాడు. బళ్ళూ కార్లూ, ఎక్కడవి అక్కడ ఆగిపోయినై.

"పాపం పిచ్చెత్తింది" అని కొందరు చప్పరించారు. యుద్ధంనుంచి కాళ్ళు విరగొట్టుకొనీ, చేతులు విరగొట్టుకొనీ, మూతులు పగలగొట్టుకొనీ, మెదళ్ళు చిట్లగొట్టుకొనీ, పిచ్చెక్కి వికృతాకారాలతో రోడ్లమీద తిరగేసే

మనుష్యుల్ని యీ మధ్య ఆ వూరి ప్రజలు చాలామందిని చూచి వున్నారు అందుకనే తేలిగ్గా "పిచ్చెక్కింది" అనే నిర్ణయం....

పిరికివాడు ఆ విధంగా పరుగెత్తి పరుగెత్తి ఊరి బయటకు పరుగెత్తాడు. అక్కడ ఒక్కక్షణం నిలబడి బాంబులు పేలుతున్న వైపుకి చూశాడు. దూరంగా చెట్లచాటునుంచీ, గుట్టలచాటునుంచీ తుపాకీలతో బిలబిలా పరుగెత్తుకువస్తున్న సైన్యాన్ని చూశాడు.

చెయ్యి వొణికింది. భుజంమీదవున్న విదేశజెండా రెపరెప కొట్టుకుంది. హృదయం ఆవేశంతో తుకతుకలాడింది. తన శక్తినంతా కేంద్రీకరించుకొని "జై జై! ఈ జెండాకే జై. ఇదే జెండాకీ జై" అని కేకలు పెట్టుకుంటూ వచ్చే సైన్యానికి ఎదురుగా మళ్ళీ పరుగు లంకించుకున్నాడు. ఒక్కొక్క అడుగు దగ్గరకు వెల్తున్నకొద్దీ గాలే మారిపోతున్నది. కర్ణ రంధ్రాల్ని బద్దలుకొట్టే మోతలు. కళ్ళు తెరవటమే కష్టమయింది. అలాగే పిరికివాడు శరీరాన్ని బిగబట్టి పరిగెత్తాడు. భుజంమీదవున్న జెండా గాలికి గిలగిల కొట్టుకుంటూ వుంది. హఠాత్తుగా పిరికివాడు భూమిలో గుచ్చుకుపోయినట్లు ఆగిపోయాడు.

అంతా నిశ్శబ్దం. బాంబుల మోతలు ఒక్కసారి ఆగిపోయినై. పిరికివాడు నెమ్మదిగా కళ్ళు తెరిచి చూశాడు. శవాలు! ఎటుచూచినా శవాలే! తనచుట్టూ శవాలే! కొంచెం దూరంలో సైన్యం.

ఆ సైన్యం యిదివరలోలాగా లేదు. అంతా కలిసి ఉప్పొంగిన హృదయంలాగా, పొంగిన సముద్రంలాగా వొస్తూ వుంది. ఆ సైన్యానికి ముందునడుస్తున్న వ్యక్తిని చూశాడు పిరికివాడు. అతని చేతిలోనూ జెండా వుంది. అదీ రెపరెప గిలగిల లాడుతూంది. "జై జై, ఈ జెండాకీ జై జై. పరదేశ జెండాకీ జై" అని అరిచాడు. కాని యిదేమిటి? అదేం జెండా?

దిమ్మ తిరిగి కళ్ళు బయర్లుకమ్మి పిరికివాడిచూపు సరిగ్గా ఆనటంలేదు. సైన్యం అలికిన గోడలా కనిపించింది. వాళ్ళ చేతుల్లోని తుపాకులు నెమలి

పించాల్లా విప్పుకుంటున్నట్లు కనిపించాయి. జెండా పట్టుకున్నవ్యక్తి తోలు బొమ్మలా, రెల్లు దుబ్బులా కనిపించాడు. అతని చేతులలోవి జెండా స్వదేశం జెండా!

కాని పిరికివాడు నమ్మలేకపోయాడు. కళ్ళు తుడుచుకొని చూట్టానికి తన చేతులో జెండావుందె. మళ్ళీసైన్యాన్ని చూశాడు. స్వదేశసైనికుల్లా కనిపించారు.

"ఏమిటిది?" అతని గుండెలు పగిలినై. అది స్వదేశం జెండాయే! అది స్వదేశ సైన్యమే! తాను పొరపాటు బడ్డాడు. ఈ సంగతి ఆకళింపుకు రాగానే తన గదిలోవున్న స్వదేశం జెండా జ్ఞప్తికి వచ్చింది. కెవ్వున కేకవేసి గిర్రున తిరిగి తన యింటికి, స్వదేశంజెండా కోసం పరుగు లంకించుకున్నాడు.

ఢాం....ఢాం....

పరుగెత్తే పిరికివాడి గుండెలలోకి ఒకేసారి రెండుగుళ్ళు జొరబడ్డాయి. ఒకటి సైన్యంలో నుంచీ, ఒకటి చెట్టుచాటునుంచీ వచ్చినై. ఒకటి వీపులోనుంచీ, ఒకటి రొమ్ములోనుంచీ గుండెలలో దూరి కలుసుకున్నై. ఆ విశాల హృదయంలో స్వదేశ విదేశ నాగరికతల సమ్మేళన.ఈ విధంగా జరిగింది.

"అమ్మో!" అనే భయంకర ఆర్తనాదమే ఈ సమ్మేళన ఫలితం

పిరికివాడు ఆ రెండు గుండు దెబ్బలతో కిందపడి, లుంగలుపడి, చాపలా చుట్టుకుపోయి, తల రొమ్ములోకి దూర్చుకొని, ప్రాణాలు వొదిలాడు. ప్రాణాలు పోయేముందు మాత్రం పెదవులు కదిలినై —
"స్వదేశం గెలిస్తే ఈ జెండా, పరదేశం గెలిస్తే ఈ జెండా."